క్లుప్తంగా

అనుకూలమైన స్థలాలు కేటాయించాలని వినతి

నెల్లిమర్ల: తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని నగర పంచాయతీకి చెందిన పలువురు లబ్ధిదారులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. ఈ మేరకు పలువురు జగనన్న కాలనీ లబ్ధిదారులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని, డీటీ శైలజకు వినతి పత్రం అందజేశారు. సొంతిళ్లు లేని తమకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందని.. అయితే కొండపైన కేటాయించిన స్థలాలు అనుకూలంగా లేవని ఇదివరకే అధికారుల దృష్టికి తీసుకొచ్చామన్నారు. అయినా కొత్త స్థలాల కేటాయింపునకు అధికారులు చొరవ చూపించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఇళ్ల నిర్మాణానికి అనుకూలమైన స్థలాలను కేటాయించాలని లబ్ధిదారులు కోరారు.

చలివేంద్రం ప్రారంభం



రామతీర్థంలో వేతనదారులకు మజ్జిగ సరఫరా చేస్తున్న కంచరాపు రాము, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచరాపు రాము సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పని ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేతనదారులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ లెంక రామునాయుడు, క్షేత్ర సహాయకురాలు గాదిపల్లి సంతోషి, పాల్గొన్నారు.

వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు

విజయనగరం ఫోర్ట్: ఎండ తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా ఉపాధిహామీ వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఐదు వేల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేసినట్లు డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ రమణకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు 39 నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతున్న దృష్ట్యా వేతనదారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 10 గంటలు లోగా పనులు ముగించుకుంటే వడదెబ్బ బారిన పడకుండా ఉంటారని తెలిపారు. మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఓఆర్‌ఎస్ ద్రావణం తాగితే ఉపశమనంగా ఉంటుందని చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అగ్నిమాపక అధికారి కె.వినయ్‌కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తోటపాలెంలో ఉన్న కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్, గ్యాస్, ఆయిల్ ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ఎలాంటి నివారణ చర్యలు చేపట్టాలో వివరించారు. కార్యక్రమంలో వి.సోమేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థి

విజయనగరం రూరల్: మండలంలోని సారిక గ్రామంలో జీవామృతంతో పంటకు చేకూరే లబ్ధిపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్లాకిమిడికి చెందిన సెంచూరియన్ యూనివర్సిటీ బీఎస్సీ విద్యార్థులు మాట్లాడుతూ, పంటలో జీవామృతం ఉపయోగిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. అలాగే పంటలకు ఆశించే తెగుళ్ల, నివారణ చర్యలపై వివరించారు.

జైకా నిధులతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న నీడ్ సంస్థ ప్రతినిధి వేణుగోపాల్

పూసపాటిరేగ: జైకా నిధులు 30.5 లక్షల రూపాయలతో రెల్లివలస ఊరట్యాంకు ఆధునీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని నీడ్ సంస్థ ప్రతినిధి వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని రెల్లివలస సచివాలయంలో రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూక్ష్మప్రణాళిక ద్వారా ఆయకట్టు రైతులకు నీరు అందించడమే పథకం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సూక్ష్మప్రణాళిక పథకం ఏపీడీ మురళి, టీఓ రవికుమార్, ఫీల్డ్ అధికారి ప్రసన్నకుమారి, ప్రణయ్, ప్రజాప్రతినిధులు ఎంపీజీ శంకరరావు, మహంతి శ్రీనివాసరావు, ఇజ్జరోతు ఈశ్వరరావు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఊరిలోనే ప్రభుత్వ సేవలు..

- సత్ఫలితాలిస్తున్న సచివాలయ వ్యవస్థ
- ప్రతి సచివాలయంలో డిజిటల్ సేవలు
- సాంకేతిక పరిజ్ఞానంతో ధ్రువీకరణ పత్రాలు
- స్థాయిని బట్టి 72 గంటల్లో మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



సతివాడ సచివాలయంలో ఆధార్ సేవలు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నూతన మార్పులు చోటు చేసుకున్నాయి.. ప్రజాసంకల్ప పాదయాత్ర సమయంలో గ్రామీణ ప్రజల కష్టాలను అతి దగ్గరగా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి నిరుపేద కుటుంబానికి చేరాలనే ఉద్దేశంతో దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను రూపొందించి, ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏరాటు చేశారు. అందులో భాగంగానే ప్రతి సచివాలయ పరిధిలోని ప్రజలకు డిజిటల్, సాంకేతిక సేవలు అందిస్తున్నారు. ప్రతి అధికారిక పత్రం కోసం ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరగకుండా పల్లెల్లో ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయాల్లోనే అందజేస్తున్నారు. ప్రజలు వారి అవసరం కోసం దరఖాస్తు చేసే ధ్రువపత్రాల స్థాయిని బట్టి 15 నిమిషాల నుంచి 72 గంటల్లో అందిస్తున్నారు. ప్రధానంగా 11 ప్రభుత్వ శాఖలకు చెందిన ధ్రువపత్రాలు సకాలంలో మంజూరు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి వచ్చిన సేవలు..

రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందే తడవుగా ప్రతి సచివాలయంలో ఈ–సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ముఖ్యమైన 54 రకాల సేవలు ప్రజలకు అందుతున్నాయి. ఆయా సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్.. వలంటీర్ల సహాయంతో ప్రజలకు పత్రాలు మంజూరు చేస్తున్నారు. కులం, ఆదాయం, ఆధార్ ఈకైవీసీ, పట్టాదారు పాస్ పుస్తకం, వన్‌బీ, అడంగల్, ఎఫ్‌ఎంబీ, జనన, మరణ, కొత్త రేషన్ కార్డులు, ఈసీ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్‌తో పాటు పలు రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నారు. అయితే ఒక్కో సేవ రూ. 15 కే అందజేయడం విశేషం. గతంలో మీ–సేవ కేంద్రాల్లో ఈ సేవలు అందినప్పటికీ, అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసేవారు. ఇటువంటి క్రమంలో ప్రభుత్వం సచివాలయాల ద్వారా గ్రామీణ ప్రజలకు ఇలాంటి సేవలను పారదర్శకంగా అందిస్తుండంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్ సేవలకు విశేష స్పందన

నియోజకవర్గంలోని భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల, డెంకాడ మండలాల్లో తొలి విడతగా 12 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. కేంద్రాల నిర్వహణకు అవసరమైన పరికరాలను ప్రభుత్వమే సమకూర్చింది. దీంతో ఆధార్ కేంద్రాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో ప్రజలు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకుంటున్నారు.

తిరగాల్సిన పని తప్పింది...



గ్రామ సచివాలయాలు రావడంతో కార్యాలయాల చుట్టూ తిరిగే పని తప్పింది. గతంలో భూ సమస్య కోసం ఎన్నో సార్లు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లినా పని జరగలేదు. సచివాలయంలో సులభంగా నా సమస్య పరిష్కారమైంది. ఇతర పనులు కూడా సకాలంలో జరుగుతున్నాయి.

– మజ్జి చిన్నంనాయుడు, రైతు, సతివాడ గ్రామం

ప్రజల నుంచి స్పందన...



సచివాలయాల్లో ఈ సేవలపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఏళ్ల కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా సచివాలయాల ద్వారా పరిష్కరిస్తున్నాం. ప్రతి అవసరానికి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది.

– గిరిబాల, ఎంపీడీఓ, నెల్లిమర్ల

అభివృద్ధికి పెద్దపీట



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



రైతుభరోసా కేంద్రం, సచివాలయ భవనాల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని శాసనసభ డిప్యూటీ స్పీకర్, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని కొండకరకాంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలో రూ. 72 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ కేంద్రం, రైతుభరోసా కేంద్రం, సచివాలయం అదనపు భవనాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించారు. అలాగే ఒక్కో ఇంటికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దళారులు, లంచగొండితనం, అవినీతికి తావులేకుండా ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వల్ల ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. అలాగే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి ప్రజా స్పందన అద్భుతంగా ఉందన్నారు. ప్రతిపక్షం గత ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఏమి చేసిందని ప్రశ్నించార. నారా చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేశాడన్నారు. జన్మభూమి కమిటీల అరాచకాలు, అవినీతి ఎంతగా సాగిందో రాష్ట్ర ప్రజలకు తెలుసు కాబట్టే టీడీపీని చిత్తుగా ఓడించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాథరావు, సర్పంచ్ కిలారి రమ్య, ఎంపీటీసీ సభ్యురాలు బి.ఈశ్వరమ్మ, గ్రామ కమిటీ అధ్యక్షులు రెడ్డి ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కిలారి పైడితల్లి, కిలారి రాంబాబు, భోగాపురపు ఆదినారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడలో ఉపకరణాల గుర్తింపు శిబిరం రేపు

నెల్లిమర్ల: డెంకాడ మండల కేంద్రంలో దివ్యాంగులకు ఉపయోగపడే ఉపకరణాల గుర్తింపు శిబిరం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి. గిరిబాల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోనున్న దివ్యాంగులు తమకు అవసరమైన ఉపకరణాల కోసం శిబిరానికి హాజరు కావాలని కోరారు. ఉదయం 10 గంటలకు డెంకాడ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు సదరం సర్టిఫికెట్ (40 శాతం కన్నా ఎక్కువ), ఆదాయ ధ్రువీకరణ పత్రం (నెలకు రూ. 15 వేలకు మించరాదు), రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు (అంగవైకల్యం కనిపించే విధంగా) తీసుకురావాలని సూచించారు. దివ్యాంగులంతా అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

పూసపాటిరేగ: తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మండల పంచాయతీ అధికారి డి. శ్రీనివాసురావు తెలిపారు. మండలంలోని చల్లవానితోటలో సర్పంచ్ పతివాడ వరలక్ష్మి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, మిషన్ వాత్సల్య, స్వమిత్ర పథకాలపై పంచాయతీ సభ్యులకు అవగాహన కల్పించారు. జిల్లాలోనే చల్లవానితోట ఉత్తమ పంచాయితీగా ఎంపికవ్వడంతో సర్పంచ్ వరలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పతివాడ శ్రీనివాసరావు, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు ప్రత్యేక డ్రైవ్

వేపాడ: ఆధార్ కార్డులు తీసుకుని పదేళ్లు దాటిన వారంతా తమ ఆధార్‌ను విధిగా అప్‌డేట్ చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్. సూర్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ఆధార్ అప్‌డేట్‌కు ఈనెల 18, 19, 20, 26, 27వ తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మండలంలో వల్లంపూడి, వావిలపాడు, సోంపురం, కుమ్మపల్లి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలనుకునే వారు తమ ఆధార్ కార్డులతో ఆయా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

మత్స్యకార భరోసా మంజూరుపై సర్వే



మత్స్యకార భరోసా గణన నిర్వహిస్తున్న మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి, తదితరులు

పూసపాటిరేగ: సముద్రంలో చేపల వేట నిషేధం కారణంగా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు మత్స్యకార భరోసా మంజూరుకు అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి ఆధ్వర్యంలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో సర్వే చేపట్టారు. ఆయా మండలాల్లో 700 ఇంజిన్ బోట్లు, 400 సంప్రదాయ బోట్లు రిజిస్ట్రేషన్‌తో ఉన్నాయి. వాటన్నింటిలో పనిచేసిన మత్స్యకారుల వివరాలపై గణన జరిగింది. చింతపల్లి , పతివాడబర్రిపేట, తమ్మయ్యపాలెం, తిప్పలవలస, కోనాడ గ్రామాలలో సర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి యు. చాందిని, చింతపల్లి మెరైన్ సీఐ వి. శ్రీనివాసరావు, ఎస్సై టి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏటీ అగ్రహారంలో ఆర్డీఓ పర్యటన



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యకళ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ ముంపు గ్రామమైన ఏటీ అగ్రహారంలో ఆర్డీఓ సూర్యకళ సోమవారం పర్యటించారు. ఏటీ అగ్రహారం, పడాలపేట గ్రామాలకు చెందిన నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు సమీపంలోని దన్నానపేట – కుమిలి రహదారిలో స్థల పరిశీలన చేశారు. సర్వే నెంబర్లు 483, 484, 485, 486లో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి అంచనా వేశారు. రెండు మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులతో మాట్లాడి ప్రభుత్వ భూముల హద్దులను అడిగి తెలుసుకున్నారు. అటవీ శాఖకు చెందిన భూములను సరిచూసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ముంపు గ్రామ నిర్వాసితులు తమ సమస్యలను ఆర్డీఓకు విన్నవించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ కమిషనర్ శ్రీరాములనాయుడు



ప్రజారోగ్య అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలోని సామాజిక మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజారోగ్య అధికారులు, సిబ్బందికి కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు ఆదేశించారు. ఈ మేరకు ప్రజారోగ్య సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక మరుగుదొడ్ల పరిస్థితిపై సమగ్ర పరిశీలన చేయాలని సూచించారు. వివిధ సంఘాల ద్వారా సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ జరుగుతోందని.. అయితే కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే నగరంలో చిన్న చిన్న సందుల్లో ఆక్రమణలు పెరిగిపోయినట్లు స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, వాటిని తొలగించేందుకు నగర ప్రణాళిక అధికారులకు ఆదేశించామన్నారు. సమావేశంలో ఏసీపీ అమ్మాజీరావు, ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడండి..

- ఎంపీడీఓ గిరిబాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల: ప్రస్తుత వేసవికాలంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని మండలస్థాయి అధికారులు, సచివాలయ కార్యదర్శులకు ఎంపీడీఓ జి. గిరిబాల ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాల్సిన బాధ్యత సచివాలయ కార్యదర్శులపైనే ఉందన్నారు. అలాగే ప్రతి సచివాలయంలోనూ చలివేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో నిర్మాణంలో జగనన్న ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమంలో తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భానోజీరావు, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, వైకేపీ ఏపీఎం సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాలు కోల్పోయిన వారు ఎంతోమంది ఉంటున్నారని.. మనం చేసే రక్తదానం ఎందరికో కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుందని ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పట్టణానికి చెందిన భారత మాజీ వాయు సైనికుడు, ఉపాధ్యాయుడు బొడ్డేపల్లి రామకృష్ణారావు 175వ సారి రక్తదానం చేయనున్న నేపథ్యంలో మే 1వ తేదీన విజయనగరం పట్టణంలోని రెవెన్యూ హోమ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. జిల్లా సైనిక బోర్డు, జిల్లా యువజన కేంద్రం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కోలగట్ల సోమవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి నేపథ్యంలో రక్తం కొరత అధికంగా ఉంటుందని, ఇటువంటి సమయంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అత్యవసర సమయంలో ప్రజలకు ఏ అవసరం వచ్చినా తాము ఎప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, సాగి నారాయణ రాజు, బొడ్డేపల్లి రామకృష్ణారావు, ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ టి. నాగేశ్వరరావు, జి.రమేష్, టి. చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో హనుమాన్ చాలీసా పారాయణం



ఆంజనేయ స్వామి సన్నిధిలో పారాయాణం చేస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రమైన రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో పూర్వాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖకు చెందిన హనుమాన్ భక్త మండలి ప్రతినిధి కందాళ వెంకట సత్యశ్యామ్ బృందం ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామికి పంచామృత అభిషేకం, తమలపాకులు, సింధూరంతో అర్చనలు నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. రానున్న కార్తీకమాసం వరకు కోటి హనుమాన్ చాలీసా పారాయణాలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో అభయాంజనేయ స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్వభద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు చాణక్య ఆధ్వర్యంలో స్వామివారికి స్నపనం, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన చేపట్టారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్..'కు స్పందన



దల్లిపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా చేపట్టిన జగనన్నే నువ్వే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మండలంలోని దల్లిపేట, తదితర గ్రామాల్లో సోమవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, తదితరులతో కలసి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి పరిపాలనపై ప్రజాభిప్రాయం సేకరించారు. అనంతరం ఇంటి యాజమానుల అనుమతితో గోడలపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దల్లి కాంత, అపురభుక్త పైడినాయుడు, నాయకులు కొయ్య లక్ష్మణ్, దల్లి శ్రీనివాసరావు, అన్నమయ్య పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం..

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి
- వసతిగృహానికి రూ. లక్ష విలువైన వస్తువుల అందజేత



వసతిగృహానికి అందజేసిన సామగ్రితో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, సిబ్బంది, విద్యార్థులు

విజయనగరం: ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా కోలగట్ల వీరభద్రస్వామి కుటుంబం అండగా ఉంటుందని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 19వ డివిజన్ పరిధి లంకాపట్నం ఆది ఆంధ్ర ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న పట్టణ అణగారిన బాలుర వసతిగృహాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఇటీవల సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పిల్లలు మౌలిక సదుపాయాల లేమితో ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని గుర్తించి.. తన వంతుగా సహాయం చేస్తానని మాట ఇచ్చారు. ఇందులో భాగంగా సోమవారం సుమారు లక్ష రూపాయల విలువైన దుప్పట్లు, పరుపులు, దిండ్లు, ఫ్యాన్లు, స్టవ్, వంట పాత్రలు, తదితర వస్తువులను నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి చేతుల మీదుగా వసతిగృహ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పిల్లలు ఏ సందర్భంలోనూ అవస్థలు పడకూడదన్న ఉద్దేశంతో కేవలం పది రోజుల్లోనే వసతిగృహానికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చక్కగా చదువుకోవాలని ఆకాంక్షించారు. చదువు, వసతులపరంగా ఏ అవసరం వచ్చినా తమను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. 19వ డివిజన్ కార్పొరేటర్ పొట్నూరు శ్రీను మాట్లాడుతూ, ఈనెల 26న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి జన్మదినం సందర్భంగా అణగారిన పిల్లల వసతిగృహానికి పెద్ద ఎత్తున వస్తు సామగ్రిని అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ మీసాల రమాదేవి, కో ఆప్షన్ సభ్యులు పిల్లా పద్మావతి, మాజీ కౌన్సిలర్ లంక వరలక్ష్మి, ఆయా డివిజన్ పార్టీ అధ్యక్షులు దేశెట్టి మోహనరావు, కేశవ, సీనియర్ నాయకులు పిల్లా రామకృష్ణ, ఎస్.అశోక్, వెంకట్, తిరుమలరావు, వసతిగృహ నిర్వాహకులు నారీమణి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.